అందమైన  చేతివ్రాత  – నారంశెట్టి ఉమామహేశ్వరరావు

'చేతిరాత బాగుంటే తలరాత బాగుంటుందని' పెద్దల మాట. చేతివ్రాతనే దస్తూరి అంటారు. దస్తూరి అనేది వ్యక్తిత్వానికి ప్రతీక. చేతివ్రాతను చూడగానే  వ్రాసిన వారి గురించి ఒక అంచనాకు రావచ్చనే అభిప్రాయం ఉంది.

బాల్యం నుండి    కొందరు విద్యార్థులు  ఒరవడి పుస్తకాలు దిద్దుతూ  అందమైన దస్తూరితో వ్రాయడం నేర్చుకుంటారు.    దస్తూరి బాగుండేలా  వ్రాయడం   అలవాటయిన వారు క్రమశిక్షణ కలిగిన వాళ్లని చెప్పవచ్చు. దస్తూరి బాగుండేలా రాయాలంటే ఓపికగా కూర్చుని  శ్రద్ధగా వ్రాయడం అవసరం. ఒరవడి పుస్తకంలో ఉపాధ్యాయుడు మొదటి వరుసలో  వ్రాసిన అక్షరాలను, వాక్యాలను  ఓపికగా, కుదురుగా వ్రాయడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలి. అలా చేసినప్పుడే దస్తూరి  మెరుగవుతుంది. ఉపాధ్యాయులు వ్రాసిన వాక్యాలను ఆదరాబాదరా  రాసేసి ఒరవడి దిద్దడం అయిపోయిందనుకుంటే అది మొక్కుబడి తప్ప మరేం కాదు. అందువల్ల  విద్యార్థికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఒక కాగితం, కొంత సిరా వృధా తప్ప మరే ఉపయోగం  లేదు. కాబట్టి గురువులిచ్చిన ఒరవడిని శ్రద్ధగా ఎవరైతే పూర్తి చేస్తారో వాళ్లకి చక్కటి  దస్తూరి అలవడుతుంది.

అభ్యాసం కూసువిద్య అన్నారు  పెద్దలు. చేతివ్రాత మాత్రమే కాదు ఏ విద్య అయినా, కళ అయినా అభ్యాసం చేయడం వల్ల నేర్చుకోవచ్చు.  విద్యార్థి దశ  నుంచే  ప్రతి ఒక్కరికీ చక్కటి చేతివ్రాత అవసరం. అందమైన వ్రాతతో  భావవ్యక్తీకరణ చేసేవారికి, అది చదివే వారికి కూడ చక్కని అనుభూతి కలిగిస్తుంది. అందమైన దస్తూరీతో   వ్రాయడం వల్ల   చదివేవారికి  సులభంగా అర్థమవ్వడమే  కాకుండా, అది ఆ  వ్యక్తి యొక్క నిష్ట, శ్రద్ధ, క్రమశిక్షణలతో కూడిన ప్రతిభను తెలియజేస్తుంది.

అనగననగ రాగమతిశయిల్లుచునుండు,
తినగ తినగ వేము తీయనుండు,
సాధనమున పనులు సమకూరు ధరలోన,
విశ్వదాభి రామ వినుర వేమ!

అని  సాధన  చేయడం ద్వారా కలిగే ప్రయోజనాన్ని యొక్క  బలంగా చెప్పారు వేమన పద్యంలో.   క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా ఒక పాటను శ్రావ్యంగా పాడవచ్చు. వేప ఆకులను క్రమం తప్పకుండా తింటే కొంత సమయం తర్వాత తీపిగా ఉంటుంది.  అదేవిధంగా నిత్య సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చునని ఉదహరిస్తూ,   సాధనతో ఆచరణ చేయడంవల్ల కలగబోయే  పరివర్తనని చెప్పారు వేమన. అందువలన అశ్రద్ధ చేయకుండా చేతివ్రాతని  మెరుగుపరచుకోవడం మీద దృష్టి పెట్టాలి పిల్లలు. సాధన చేస్తే సాధ్యం కానిది  ఏదీ లేదు.

చేతివ్రాత గురించి తెలిపే శాస్త్రాన్ని "గ్రాఫాలజీ" అంటారు. ఇది ఒక శాస్త్రీయ పద్ధతి.  చేతివ్రాత ఆధారంగా ఒక  వ్యక్తి యొక్క  వ్యక్తిత్వ లక్షణాలను అంచనా వేయడానికి ఉపయోగిస్తారు. గ్రాఫాలజీ ప్రకారం, ఒక వ్యక్తి ఎలా వ్రాస్తాడు, అక్షరాల ఆకారాలు, వాటి ఒత్తిడి, మధ్యలో ఖాళీలు వంటి అంశాలను అధ్యయనం చేయడం ద్వారా ఆ వ్యక్తి  యొక్క వ్యక్తిత్వ లక్షణాలు, భావోద్వేగ స్థితి, ఆలోచన విధానం గురించి తెలుసుకోవచ్చని నమ్ముతారు.

ఉదాహరణకు  పెద్ద అక్షరాలు వ్రాసేవారు ఎక్కువ ఆత్మవిశ్వాసం కలిగిన వాళ్ళు కావచ్చు, చిన్న అక్షరాలు వ్రాసేవారు సాధారణంగా పరిణితి ఉన్న వారిగా ఉండవచ్చు.  అక్షరాల మధ్య ఖాళీలు ఎక్కువ  ఉంటే, స్వేచ్ఛను కోరుకునే వ్యక్తి అని భావించవచ్చు. అక్షరాల ఒత్తిడి గట్టిగా ఉంటే, ఆ వ్యక్తి  శక్తివంతంగా లేదా ఆత్మవిశ్వాసంతో ఉండవచ్చని గ్రాఫాలజీ ద్వారా చెబుతారు. అయితే  ఈ శాస్త్రం పూర్తి శాస్త్రీయంగా నిరూపితమైందని చెప్పలేము. ఇది ఒక అంచనా మాత్రమే.  కానీ ఎక్కువ  మంది దీని గురించి ఆసక్తి చూపుతుంటారు.

మనకు తెలిసిన గొప్ప నాయకుల్లో  కొందరి చేతివ్రాత గురించి తెలుసుకుందాం. తన చేతివ్రాత గురించి గాంధీజీ  స్వయంగా చెప్పుకున్నారు. చేతివ్రాత సరిగ్గా లేదని, చిన్నతనంలో చేతివ్రాతను మెరుగుపరుచు కోలేకపోయానని బాధపడ్డారు.  యువతకి మంచి చేతివ్రాత అవసరమని, ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వం చేతివ్రాత ద్వారా ప్రతిబింబిస్తుందని  చెప్పేవారు.

రవీంద్రనాథ్ ఠాగూర్  గొప్ప  కవి, కళాకారుడు,  సృజనాత్మకత నిండిన వ్యక్తి. ఆయన  చేతివ్రాత అందంగా ఉండేది. ఆయన చేతివ్రాత ద్వారా తన భావాలను వ్యక్తం చేయడంలో ప్రత్యేకత చూపేవారు.

నెహ్రూగారి చేతివ్రాత సాఫీగా ఉండేది. ఆయన వ్యక్తిత్వం లాగే, వాస్తవికత, స్పష్టత ఆయన చేతివ్రాతలో కూడా కనపడేది.

తన వయస్సుతో పాటు, అనుభవాలతో చేతివ్రాతలో మార్పు వచ్చిందని ఇందిరా గాంధీ  గురించి చెబుతారు. ఆమె విద్యాభ్యాస సమయంలో  చేతివ్రాత చక్కగా ఉండేది. తరువాత కాలంలో రాజకీయ బరువు వల్ల అక్షరాల్లో మార్పు వచ్చింది.

దస్తూరి బాగుండడం వల్ల   ప్రయోజనాలున్నాయి .   అందమైన  దస్తూరితో    వ్రాసేవాళ్ల  వ్రాతల్లోని ప్రతి అక్షరాన్ని  స్ఫుటంగా, నిర్దిష్టంగా చదవగలుగుతారు. వ్రాసినది కష్టం కలగకుండా త్వరగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. రాసేవారిలో    ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. వ్రాసిన పత్రాలు శుభ్రంగా, అందంగా ఉంటే చేసే పని పట్ల గర్వపడతారు.

విద్యార్థులు శ్రద్ధగా వ్రాయడం వారిలో క్రమశిక్షణని తెలుపుతుంది. ప్రతి అక్షరం, పదం సరిగ్గా రాయడం వారిలో నిరంతర శ్రద్ధను పెంపొందిస్తుంది. అందమైన దస్తూరీతో వ్రాసేవారికి బడిలో జరిగే పరీక్షల్లో మార్కులు ఎక్కువ వస్తాయి వల్ల ఉపాధ్యాయుడి నుండి మెప్పు పొందుతారు.  కేవలం పరీక్షల్లోనే  కాకుండా ఉన్నత చదువులకు జరిగే ప్రవేశ పరీక్షల్లో ,  ఉద్యోగాలకు జరిగే పోటీ పరీక్షల్లో కూడ ప్రయోజనం పొందడానికి అవకాశం ఎక్కువగా  ఉంటుంది.

ఒకప్పుడు ఉత్తరాలు వ్రాసుకునే అలవాటు ఉండేది. బాల్యం  నుండే     అమ్మమ్మ,  నాన్నమ్మ, తాతయ్యలకు ఉత్తరాలు వ్రాసేవారు పిల్లలు. అటునుండి నుండి వచ్చిన ఉత్తరాలు చదివి మురిసిపోయేవారు. అలా ఉత్తరాలు వ్రాసేటప్పుడు అందంగా చేతివ్రాత ఉన్న పిల్లల్ని మెచ్చుకునేవారు పెద్దలు. దస్తూరి బాగాలేని వారిని చేతివ్రాత మెరుగుపరచుకోవాలని  సూచించేవారు. మనవడి ఇంటికి చుట్టరికానికి వచ్చినప్పుడు చేతివ్రాత పాముఖ్యత చెప్పేవాళ్ళు.  వీలయితే వ్రాసి దిద్దించేవారు. అప్పటి బంగారు  రోజులన్నీ మాయమయ్యాయి. ఇప్పుడంతా  మొబైల్ మహిమ తో ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి.  మెసేజిలు, వాట్సాప్ మెసేజిలు  రూపంలో సమాచార వ్యక్తీకరణ జరుగుతోంది.  కంప్యుటర్లో టైపు చేసి మెయిల్ పంపించడం మొదలైన ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగిస్తున్నారు.  ఎన్ని కొత్త పద్ధతులు వచ్చినా సరే చేతివ్రాత అవసరం పూర్తిగా తొలగిపోలేదు. అందుకే  దస్తూరిని అశ్రద్ధ చేయకూడదు.

సాధారణంగా బాల్యంలోనే చేతివ్రాత అందంగా వ్రాయడానికి బీజాలు పడతాయి. ఉపాధ్యాయులు చెప్పిన నోట్స్ వ్రాసేది చేతిరాతతోనే కదా. విద్యార్థి వ్రాసింది గురువుకి సరిగా బోధపడినప్పుడే ఆ విద్యార్థి మీద గురువు గారికి మంచి అభిప్రాయం కలుగుతుంది. కాబట్టి దస్తూరి బాగుండేలా వ్రాయడానికి ప్రయత్నించండి.

మంచి దస్తూరి కలిగి ఉండడం చక్కటి వ్యక్తిత్వానికి ప్రతీక. విద్యార్థులే కాకుండా ఉద్యోగుల నుంచి ప్రముఖుల వరకు అందమైన వ్రాత కలిగిన వారు తమ పని పట్ల శ్రద్ధ చూపడం ద్వారా సమర్థవంతమైన వ్యక్తులుగా ఎదుగుతారు. అందుకే, ప్రతి ఒక్కరూ తమ చేతివ్రాతను మెరుగుపరచుకోవడానికి ప్రయత్నించాలి. "అందమైన చేతివ్రాత అదనపు అర్హత" అని చెప్పవచ్చు.

—-*****——